

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# షైలాక్ సుందర్రావు

**నేను, మా ఆవిడ** కామేశ్వరి ఏడురోజుల కర్ణాటకయాత్ర ముగించుకుని ఆరోజు పొద్దునే ఇంటికి చేరాం. శృంగేరి మొదలుకొని యాత్రంతా కొండకోనల్లో జరగడంవల్ల మొబైల్ ఫోనుకు సిగ్నళ్లు సరిగ్గాలేక మా బురుజువీధి విశేషాలేమీ మాకు ఆవారమంతా తెలియలేదు.

బడలిక తీర్చుకొని ఇంటిపనుల్లో పడగానే మా బురుజువీధి 'వార్తల వనజమ్మ' వీధితలుపు తోసుకొచ్చి మా యాత్ర ఎలాజరిగిందని త్వరత్వరగా క్షేమసమాచారాలు అడిగింది.

ఆమె ఏదోచెప్పాలని వచ్చిందని అర్థమై. విశేషాలగురించి తనే అడిగింది కామేశ్వరి.

"హోటల్ సుందర్రావుకు ఐదురోజులకిందట పెద్ద గుండెపోటు వచ్చింది తెలుసా? టౌన్లో గవర్నమెంటు ఆసుపత్రిలో బైపాస్ ఆపరేషన్ చేసారట. ఆయుష్షు గట్టిదని, ప్రాణాపాయం కాస్తలో తప్పిందని అన్నారు" అని గబగబా చెప్పి ఊపిరి పీల్చుకుంది వనజమ్మ.

“అయ్యో"అన్నాము నేను, కామేశ్వరి ఒకేసారి.

“హోటల్లో ఆరోజంతా నీరసంగా కనిపించాట్ట. చాతీలోనొప్పని ఆరాత్రి పడిపొయాట్ట. హోటలువర్కర్లే డాక్టర్ను తీసుకొస్తే వెంటనే టౌన్లో పెద్దాస్పత్రికి తీసుకెళ్ళమన్నాట్ట. వాళ్లే ట్యాక్సి మాట్లాడి తీసుకెళ్లి చేరిపించార్ట" గుక్క తిప్పుకోకుండా చెప్పి "పొయ్యిమీద ఉప్మా పెట్టొచ్చాను, మాడిపోతే మీఅన్నయ కేకలేస్తాడు. మళ్లీ వస్తా" అని వెళ్లిపోయింది.

వనజమ్మ అలావెళ్లగానే వాళ్ల ఎదురింటి సుశీలవచ్చి మిగతా వివరాలు చెప్పివెళ్లింది. 'విజయవాడలోవున్న సుందర్రావు కూతురు దీప మరుసటిరోజు పొద్దునగ్గాని రాలేకపోయింది. ఐతే అప్పటికే డాక్టర్లు ప్రమాదం తప్పించారు. దీప వచ్చాక మొన్న బైపాస్ చేసారు. ప్రస్తుతం ఐసీయూలో పెట్టారు. అంతా బానేవుంది. మూడురోజుల్లో రూముకు మారుస్తారు. తను, తనభర్త 'పరోపకారి పాండురంగ' ఆస్పత్రికి రోజూ వెళ్లొస్తూ దీపకు సహాయం చేస్తున్నారు.'

"మంచివాడు. అందుకే అంతమొచ్చింది. ఐనా వొక్కనిముషమైనా కూర్చోకుండా రోజంతా హోటల్లో అటుయిటూ తిరుగుతూనే వుంటాడు, యాభైయేళ్లుంటాయేమో, అతనికెలా వచ్చిందో గుండెపోటు" అంది కామేశ్వరి విచారంగా, నేను ఆఫీసుకు బయల్దేర్తున్నప్పుడు.

"మంచివాడేగాని, యెవ్వరితోనూ మాట్టాడ్డు, యేదీ పంచుకోడు, గుంభనగా వుంటాడు. అలాంటివాళ్లకిలాగే ఔతోందని అంటున్నారుగా డాక్టర్లు యీమధ్య" అన్నా బయటికి నడుస్తూ.

"మనవీధిలోని పెద్దలతో సరిగ్గా మాట్లాడకపోతే యెవ్వరితోనూ మాట్లాడనట్టేనా" అన్న కామేశ్వరి మాటలు వినిపించాయి వెనకనుంచి. తనెప్పుడూ అంతే. తనకే అన్నీ బాగా తెలుసనుకుంటుంది.

నడుస్తూంటే సుందర్రావు గురించిన ఆలోచనలు వరసగా వచ్చాయి.

సుందర్రావుది మా బురుజువీధిలో గుడివైపు అంటే మా వరసలో రెండో ఇల్లు. అరుగులున్న పెంకుటిల్లు. ఇంటిముందు దిరిసెనచెట్టుంటుంది. సుందర్రావు కొంచెం పొట్టిగా, సన్నగావుండి వెనక్కిదువ్విన జుట్టుతో ఎప్పుడూ తెల్లచొక్కాలో కనిపిస్తాడు. అతనికి పాతబజారులో ఒక భోజనహోటల్ ఉంది. యాభైయేళ్ల క్రితం అతని తాత ఆ హోటల్ ప్రారంభిస్తే, తండ్రి శేషారావు కష్టపడి దాన్ని వృద్ధిలోకి తెచ్చాడంటారు. అతని భార్యపోయి పదేళ్లకుపైగా ఐంది. దీప ఒక్కతే కూతురు. ఆమెకి పెళ్లై ఆరేళ్లగా విజయవాడలో ఉంటోంది. తండ్రిని తనదగ్గరికి వచ్చేయమంటోందిగాని అతను వినడం లేదు.

సుందర్రావు వొక్కడే ఇంట్లో ఉంటాడు, ఉండడమంటే రాత్రిపూటే. పొద్దున్నే వెళ్లిపోయి మళ్లీ రాత్రి ఏ పదకొండుకో రావడం. ఎప్పుడైనా ఆదివారాలు కూతురుదగ్గరికి వెళ్లొస్తూంటాడు. ఉన్నసమయంలోకూడా మావీధిలో ఎప్పుడోగాని కనపడడు. కనపడ్డప్పుడు పలకరింపుగా నవ్వి తలవొంచుకుని వెళ్లిపోతాడు. ఎవర్తోనూ పెద్దగా మాట్లాడడు. అప్పుడప్పుడూ కచేరిసత్రం బిచ్చగాళ్లతో నిండిపోయినప్పుడు కొంతమందొచ్చి సుందర్రావు ఇంటి అరుగులమీద పడుకుంటారు. అలాంటప్పుడు మా సంఘపెద్దలు అతనిమీద అరుస్తూంటారు.

గుడిలోజరిగే కార్యక్రమాలకు అతనితో భోజన ఫలహారాలు స్పాన్సర్ చేయించాలని మావాళ్లు చేసే ప్రయత్నాలు ఎప్పుడూ విఫలమౌతూంటాయి. గుడికార్యక్రమాలకు చందాలుకూడా సరిగ్గా ఇవ్వడు. మా యిళ్లల్లో జరిగే ఫంక్షన్లకు భోజనాలు సప్లై చెయ్యమని అడిగితే ఏదోవొక సాకు చెప్పి తప్పించుకుంటాడు. మావాళ్లు అతన్ని 'పీనాసి', 'షైలాక్ సుందర్రావు' అని పిలుస్తూంటారు. అంతేకాదు మా సంఘ పెద్దలమాటను ఖాతరు చెయ్యడంలేదని వాళ్లు కొన్నిసార్లు పరోక్షంగా అతన్ని ఇబ్బంది పెట్టడంకూడా జరిగింది. ఐనా అతనిలో మార్పులేదు.

ఆఫీసుకు చేరగానే సుందర్రావుగురించిన నా ఆలోచనలకు బ్రేక్ పడింది. ఆరోజు రాత్రి ఎనిమిదిగంటలకు సుందర్రావుగురించి మా వీధి సంక్షేమసంఘం మీటింగుందని ఫోనులో కబురొచ్చింది.

చెప్పిన టైముకే ఆరాత్రి మునిరెడ్డి ఇంట్లో మా వీధి సంక్షేమ సంఘం సమావేశానికి వెళ్లాను. మునిరెడ్డిది ప్రహరీగోడవున్న రెండస్తుల కొత్తమేడ. నేవెళ్లేప్పటికే సభ్యులంతా వచ్చి మాట్లాడుకుంటున్నారు.

మావీధి సంక్షేమసంఘ ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి మొదటగా సుందర్రావు అనారోగ్యంపట్ల విచారం ప్రకటించి 'తదుపరి మనమేంచేయాలో' సూచించమన్నాడు.

"అతనికిప్పుడు అన్నీ నిలకడగా వున్నాయంట. అదృష్టవంతుడు" అంది మా సంఘ సభ్యురాలు సుగుణమ్మ

“సుందర్రావుకూతురు దీపవొచ్చి చూసుకుంటావుందన్నారు. గవర్నమెంటాసుపత్రైనా యిలాంటి జబ్బులకి లక్షలు ఖర్చౌతాయంట. డబ్బు సర్దుబాటైందో లేదో” అన్నాడు చలపతి.

"ఆ హోటల్ బాగానే జరుగుతుందంటారు. పాతబజార్లో వుండడమేకాక పాతబస్టాండుకు దగ్గరకూడా. మనం అనగూడదుగానీ సంపాదించిందంతా కూతురికే పంపిస్తున్నాడంటారు. యిప్పుడు అక్కరకొచ్చింది. ముందుచూపున్నవాడే" చెప్పాడు బంగార్రాజు

“అసలతను మనందర్లాగా కలివిడిగా అందర్తో అన్నీ పంచుకుంటూవుంటే యీ జబ్బు రాకనే పోవును, యాభైయ్యారేళ్లు యేంపెద్ద వయసని" విచారంగా అన్నాడు స్వామినాయుడు.

“సంఘానికిదూరంగా వుంటే యిలాంటివే జరుగుతాయంటారు. యీరోజతనికోసం విచారించేవాళ్లెవరున్నారు పాపం! మనమున్నాంగాబట్టి సరిపోయింది" అన్నాడు బసవలింగం.

“మంచివాడేగాని అసలు వొక్కరితో మాట్లాడ్డు, యెవర్నీ ఆప్యాయంగా పలకరించడు, వ్యాపారం చేసినంతమాత్రాన అలావుండక్కర్లేదుగదా" సానుభూతి చూపించాడు సోమయాజులు.

“అతనికి డబ్బు కౌపీనమని, ‘షైలాక్ సుందర్రా’వని అన్యాయంగా అంటారు. చందాలు యివ్వకపోవడం నిజమేకావచ్చు ఐనా అట్లాఅనడం తప్పు. హోటల్ నడిపేమనిషి అందర్తో మంచిగావుంటే అప్పు పెట్టి డబ్బులెగ్గొడ్తారని భయముండొచ్చుగదా” చెప్పాడు ధనరాజ్.

“సంఘంలోవుంటూనే తగినంత స్వేచ్ఛతో వుండడం మన మూల ధర్మం. మనం అతన్ని తప్పుపట్టలేం. వ్యాధి శరీరధర్మాన్ని బట్టివొస్తుంది" అన్నాడు కాశీపతి.

“అవన్నీ మనకెందుకులేండి. అతని వ్యవహారాలు అతనిష్టం. ముందు మనమేంచేయాలో చూడండి” అందరికీ పళ్లరసం ఇస్తూ సూచించాడు మునిరెడ్డి.

"అతన్ని రేపు అంటే శనివారం రూముకు మారుస్తారట. ఐతే ఆదివారం వరకు చూడ్డానికి అనుమతించరట. సుందర్రావుహోటల్లో భోంచేసే మాఆఫీసాయన చెప్పాడు" అన్నా.

అందరూ ఆలోచనలో పడ్డారు.

"అంటే మనమంతా రేపే వెళ్లి అతన్ని చూడాలని నువ్వు పరోక్షంగా వొత్తిడి చేస్తున్నావు" నవ్వి చిన్నగా నాతో అన్నాడు నాపక్కన కూర్చున్న మాఎదురింటి చలపతి.

"ఐతే అందరం ఆదివారమెళ్లి చూసొస్తే సరి. సాయంత్రం ఐదునుంచి చూడ్డానికి అనుమతిస్తారనుకుంటా" సూచించాడు నారాయణమూర్తి.

"అతనెవ్వరితో కలవకపోయినా మనవీధిలోవున్నాడు కాబట్టి సంఘంగా అది మన బాధ్యత" బలపరిచాడు రంగశాయి. సభ్యులందరూ ఒప్పుకున్నారు.

"టౌన్లో గవర్నమెంటాసుపత్రికి వెళ్లడానికి నువ్వే వొక మంచి వ్యాను మాట్లాడు సూర్యం. మనందరం కలిసెళ్లి చాలారోజులైంది" చెప్పాడు కాశీనాథ్ నావైపు చూసి.

"ఖర్చులు పంచుకుందాంలే. మధ్యాహ్నంనుంచి రాత్రివరకు మాట్లాడు. టౌన్లో మనకేదన్నా పనున్నా చూసుకొని రావచ్చు" అన్నాడు స్వామినాయుడు నవ్వుతూ.

"అతన్ని చూడ్డానికి మనంతప్ప యింకెవరుంటారు? లోపలెక్కువసేపు వుండనీరు. అంతదూరమెళ్తున్నాం, మనకూ టౌన్లో పనులుంటాయి" బలపరిచాడు రంగశాయి.

మూర్తి "నేను నాకార్లో పొద్దున్నేవెళ్లి పన్లుచూసుకొని ఆటైముకు అక్కడికొస్తా" అన్నాడు. ధనరాజ్, మునిరెడ్డి, బసవలింగం, బంగార్రాజుకూడా 'తామూ అంతే' అన్నారు.

"ఐతే చిన్నవ్యాను చాలు. మనం మిగిలినవాళ్లం యెల్లుండి మధ్యాహ్నం రెండున్నరకు మాయింట్లో కలుద్దాం" అంటూ లేచాడు స్వామినాయుడు. అందరం లేచి ఇంటిదారి పట్టాం.

"యీ సమావేశం సుందర్రావుకొచ్చిన కష్టాన్ని తల్చుకోవడానికా, సానుభూతిగా మాట్లాడుతూ అతనిమీదున్న కోపం తీర్చుకోవడానికా? మనవాళ్లలో సగంమందికి కార్లున్నాయి. సుందర్రావుకోసం మనందర్నీ టౌనుకు తీసుకుపోవచ్చుగదా" అన్నాడు చలపతి దారిలో.

దూరంగా చీకట్లో మావీధి మొదట్లోవుండే బురుజు గతంలోంచి తప్పిపోయిన ఒంటరి ఏనుగులాగా నిలబడివుంది. మరోవైపు వీధిచివరున్న గుడితలుపులు మూసేస్తున్న చప్పుడువస్తూంది.

"సంఘానికి దూరంగావుంటే యిలాగేవుంటుంది" అన్నా మా యింటివైపు తిరుగుతూ. నేనన్నది సుందర్రావునా లేక తననా అన్న సందేహం వచ్చినట్టుంది చలపతికి. నడుస్తున్నవాడల్లా ఒకక్షణం ఆగి తిరిగి తన ఇంటివైపు కదిలాడు.

కామేశ్వరి, ఆమె స్నేహితురాళ్లు కలసి మరుసటిరోజు వెళ్లిచూసొస్తామన్నారు. వాళ్లు తీరికసమయాల్లో ఎవరోవొకరింట్లో కలిసి మాట్లాడుకుంటూంటారు. వాళ్లకో సేవాసంఘంకూడా ఉంది. ఐతే వాళ్ల ఆలోచనలు, కార్యక్రమాలు మా సంఘపెద్దలకు నచ్చవుగాబట్టి వాళ్లు ప్రచారంలేకుండా వాటిని చేసుకుంటారు.

అనుకున్నట్టే ఆదివారం మధ్యాహ్నం మూడుగంటలకు ఎనిమిదిమంది టౌనుకి చిన్నవ్యాన్లో బయలుదేరాం.

కామేశ్వరి నేను బయల్దేరేటప్పుడు ఒక ఖాళీచెక్కు ఇస్తూ "మీ పదిపడగల సంఘంవాళ్లు డబ్బుసహాయం మాటేమీ యెత్తుండరు. నీకు వ్యాను చార్జీలుకూడా అందరూ యిస్తారనుకోను. పోతేపోయిందిగాని యీ ఖాళీచెక్కు పట్టుకెళ్లు. అక్కడ అవసరముంటుంది. పిల్లతో ఆడకూతురొక్కతీ యెన్ని అవస్తలు పడుతోందో పాపం" అంది.

ఎవరికీలేని సానుభూతిని ఈమె ఎక్కువగా చూపిస్తున్నందుకు నాకు కోపంవచ్చినా 'వెళ్లేటప్పుడు వాదాలెందుకులే' అని ఊరుకుని చెక్కు జేబులోపెట్టుకుని బయలుదేరాను.

మా వ్యాను టౌన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వెనుకవైపున కొత్తగా కట్టిన కార్డియాలజి భవనానికి చేరేసరికి ఐదున్నరైంది. ఆదివారంకాబట్టి జనం ఎక్కువగానే ఉన్నారు. మేం చెట్టుకింద వేచివుండగా పదినిముషాల్లో మిగతావాళ్లొచ్చేసారు. మా సంఘ సభ్యులందరం రిసెప్షన్ హాలులోకి వెళ్లాము. రిసెప్షన్ చుట్టూ కొంతమంది మూగి యేదో అడుగుతున్నారు.

బిల్డింగ్ మధ్యలో ఉన్న విశాలమైన క్వాడ్రాంగిల్ లో అంతా గందరగోళంగా ఉంది. ఒక గుల్మొహర్ చెట్టుకింద కూర్చున్న ఒకతని చుట్టూ కొంతమంది మూగివున్నారు. క్వాడ్రాంగిల్ అవతలున్న వరండాలో ఒకవైపు గోడకానుకుని దాదాపు ముప్పైమందితో పెద్ద క్యూ లైను ఉంది. ఆ లైను మొదలు లోపలెక్కడో ఉన్నట్టుంది, కొస మాత్రం వరండాలో కనిపిస్తోంది.

క్యూ నెమ్మదిగా కదులుతోంది. కదిలేకొద్దీ కొత్తవాళ్లు చేరి క్యూ కాస్త పెరుగుతోంది. ఇద్దరు సెక్యూరిటి సిబ్బంది లాఠీలతో తిరుగుతూ ఆ క్యూను కంట్రోలు చేస్తున్నారు. క్యూ అంతా రకరకాల వ్యక్తులతో నిండివుంది. ముఖ్యంగా మాసినబట్టలతో కాయకష్టం చేసేవాళ్లు ఎక్కువగా ఉన్నారు.

"యేవో మందులు వుచితంగా యిస్తున్నట్టున్నారు" అన్నాడు రంగశాయి.

"కార్డియాలజిలో యేమందులిస్తారు. వుచిత పరీక్షలైవుంటాయి" అన్నాడు ధనరాజ్.

"విజిటర్సు టైములో యిలాంటివుంటాయా? యెవరో వార్డులీడరు చికిత్సలో ఉన్నట్టున్నాడు. అతని అనుచరులంతా వచ్చినట్టున్నారు" అన్నాడు స్వామినాయుడు.

ఈలోపల రిసెప్షన్ దగ్గర సుందర్రావు ఏరూములో ఉన్నదీ అడిగాము.

అతను మావైపు ఒకసారి ఆదరంగా చూసి ముందుకువంగి అవతలి వరండాలో కనిపిస్తున్న క్యూలైనువైపు చేత్తో చూపించి "ఆ లైన్లో వున్నోళ్లంతా సుందరరావును చూడ్డానికే వచ్చినారు. మీరుకూడా తొందరగావెళ్లి ఆ క్యూలో నిలబడండి. యిప్పటికే యెక్కువమంది చూసారని డాక్టర్లు అసహనంగా వున్నారు, యెప్పుడైనా తలుపు మూసేయవచ్చు" అన్నాడు.

మేం నిర్ఘాంతపోయాము. కళ్లెదుట కనిపిస్తున్నది నమ్మలేక ఒకరి మొహాలొకరం చూసుకున్నాము.

"మేం అతనికి సన్నిహితులం, అతను మావీధిలోనే వుంటాడు. చాలాదూరంనుంచి వస్తున్నాం. మేం నేరుగా రూంకెళ్తాం" అన్నాడు మునిరెడ్డి రిసెప్షనిస్టుతో. అతను "డాక్టరుగారినడగండి" అని మరో మనిషికి సమాధానం చెప్పడానికి పక్కకు తిరిగాడు.

మూర్తి, ధనరాజ్ "మేం డాక్టరుకు చెప్పివస్తాం మీరు రూందగ్గరుండండి" అని వెళ్లారు.

మేం ముందుకు నడిచి క్యూ దగ్గరికెళ్లాం. వెళ్లేప్పుడు చూస్తే గుల్మొహర్ చెట్టుకింద స్టూలుమీద కూర్చున్నతనికి చుట్టూవున్నవాళ్లు డబ్బిస్తున్నారు. అతను అది పుచ్చుకుని ఒక కాగితం మీద ఇచ్చినవాళ్ల పేర్లు రాసుకుంటున్నాడు.

దగ్గరికెళ్లి క్యూ చూస్తే అందులోవున్నవాళ్లు చాలామంది మాకు తెలిసినవాళ్లే. ముందున కొంతమంది ఇతరఆఫీసుల ఉద్యోగులు, టీచర్లు కనబడ్డారు.

క్యూలో పాతబజారులో షాపుల్లో పనిచేసేవాళ్లు, వీధుల్లో బళ్లుపెట్టుకుని అమ్ముకునేవాళ్లు, మార్కెట్ లో కూరగాయలమ్మేవాళ్లు, ఆఫీసుల్లో చిన్న ఉద్యోగస్తులు ఇలాంటివాళ్లు ఎక్కువమంది ఉన్నారు. వాళ్లంతా తమదగ్గరివాళ్లకు ఆపద వచ్చినట్టు విచారంగా ఉన్నారు. కొందరు మమ్మల్నిచూసి నమస్కారాలుచేసి ముందుకు వెళ్లమన్నారు.

ఇంతలో పెద్దడాక్టరు వచ్చి అందరూ నిశ్శబ్దంగా క్యూలో రాకపోతే చూడ్డం ఆపించేస్తానని మెత్తగా అరిచాడు. సెక్యూరిటి వాళ్లొచ్చి క్యూని సరిచేసారు. మాకు ఇబ్బందిగావున్నా క్యూని పాటించడంలో మేం ఆదర్శంగా ఉండాల్సిన పరిస్థితి కాబట్టి మేం ఇక తప్పదని క్యూలో నిలబడ్డాం.

నాముందు నిలబడ్డతను నేను పాతబజారు బట్టలషాపులో చూసినవాడే. మా ఆవిడకు చీరలు చూపించే ఓపికను మెచ్చుకుని అతన్ని నేను గుర్తుపెట్టుకున్నట్టున్నాను.

"సుందర్రావుకు వీళ్లు అప్పైనా యిచ్చుంటారు లేదా అతనిదగ్గర చీటీలైనా కట్టివుంటారు" చిన్నగా అన్నాడు నావెనకాలున్న రంగశాయి వెనక్కి తిరిగి.

"లేకపోతే యింతమందెందుకు వస్తారు? చెట్టుకింద చూడండి దానికి సంబంధించిందేదో నడుస్తోంది" అన్నాడు అతని వెనకాలున్న బంగార్రాజు.

ఈమాటలు వినబడ్డాయో యేమో నాముందున్న బట్టలషాపతను వెనక్కి తిరిగి "అవేమీ కాదండీ సుందర్రావుగారు మహానుబావుడండి. మాకందరికీ యెంతో సాయంజేసాడండి" అన్నాడు కాస్త గట్టిగా.

"మాలాంటి కష్టపడేవోళ్లకి అప్యాయంగా అన్నం పెట్టాడండి. వున్నప్పుడిచ్చాం, లేనప్పుడు లేదు. సొంత అన్నదమ్ముడుగూడా అట్లా పెట్టడండి. ఆయన్ను తప్పుబడితే మళ్లా మనిషిజన్మ వుంటాదాండీ" అన్నాడు అతనిముందున్న మెకానిక్ షెడ్డులో పనిచేసే మనిషి.

"నన్ను మునిసిపల్ ఆఫీసోళ్లు ముప్పుతిప్పలు పెడితే యీన వోటలొదిలేసి వాళ్లచుట్టూ తిరిగి నాపని చేయించాడుసార్. అలాంటోడు మరొకరు లేదండి" అంది ఇంకా ముందున్నామె. ఈమెను మార్కెట్లో కూరలమ్మే అవ్వగా గుర్తించాం మేము.

క్యూలో నడుస్తూనే ఐదారుగురు మాచుట్టూ చేరి సుందర్రావును గురించి వాళ్ల అనుభవాలు చెప్పడం ప్రారంభించారు. అన్నీ సుందర్రావు మంచితనాన్ని, దానగుణాన్ని తెలిపేవే. అందరూ రెక్కాడితేగాని పూటగడవనివారే. అతన్ని వాళ్లందరూ తోడబుట్టినవాడిలాగా చూస్తున్నారు. అతనికి గుండెపోటంటే తట్టుకోలేక పరుగెత్తుకుంటూవచ్చారట.

రోజూ మధ్యాహ్నం రెండుతరువాత ఎంతోమంది ఉచితంగా అతని హోటల్లో తింటారని ఒకరు, బీదవాళ్లకి అతను ఎంతోకొంత ధన సహాయం చేస్తాడని ఒకామె, అతనిహోటలుద్వారా పరిచయస్తులైన గవర్నమెంటాఫీసు ఉద్యోగులకు చెప్పి మాటసాయం చేస్తాడని ఇంకొకరు, సాయం చెయ్యలేనప్పుడు ఓదార్చి ధైర్యం చెబుతాడని మరొకరు చెప్పుకుంటూ పోయారు. ఆ చెట్టుకింద జరుగుతున్నది అతని ఆసుపత్రిఖర్చులకు వాళ్లంతా ఉడుతసాయంగా చందాలేసుకోవడమట.

వాళ్లమాటలు వాళ్లకువాళ్లు చెప్పుకుంటున్నట్టుగా నిర్వికారంగా, నిజాయతిగా, పాతవి గుర్తుకు తెచ్చుకుంటున్నట్టుగా ఉన్నాయి. మాకు చెప్పినట్టుగా లేవు. మేమందరం నిర్ఘాంతపోయి వింటూ నడుస్తున్నాము. మేము ఇలాంటివాళ్లతో ఏనాడూ సన్నిహితంగా లేముకాబట్టి సుందర్రావు ప్రపంచం మాకు తెలియకుండా ఉండిపోయింది.

మావీధిలోని సుందర్రావునే మేము సరిగ్గా అర్థం చేసుకోలేకపోయినందుకు మాకంతా ఎలాగోవుంది. అతన్నిగురించి మొన్న మేమనుకున్న మాటలు మాకే వెగటుగావున్నాయి.

దాదాపు రూందగ్గరికి వచ్చాం.

సుందర్రావును చూసేసి మాకెదురుగా వస్తున్నవాళ్లల్లో డేవిడ్ కనబడి పలకరించాడు. అతను బ్యాంకు ఉద్యోగి. "రెండ్రోజులాగి రాకపోయారా? యివాళైతే సుందర్రావును గాజుతలుపులోంచి చూడాలి. అతనికి విజిటర్లు యెక్కువగా వున్నారని, ఇన్ఫెక్షన్లు రాకుండా డాక్టర్లు అలా యేర్పాటు చేసారు" అన్నాడతను మాతో.

మేం నవ్వి ఊరుకున్నాం.

దూరంగావున్న డాక్టరు రూంలోంచివస్తూ నారాయణరెడ్డి కనబడ్డాడు. అతను నాకు, స్వామినాయుడికి, కాశీపతికి బాగాతెలుసు. తెలుగుటీచరు, యూనియన్ లీడరు.

మమ్మల్ని చూసి నారాయణరెడ్డి ఆగాడు.

“యేమంటాడు డాక్టరు” అన్నాడు స్వామినాయుడు.

“సుందర్రావుకి యిక ప్రమాదంలేదట, ఐతే కొన్నాళ్లు విశ్రాంతి అవసరమని, వెళ్లి కూతురిదగ్గర ప్రశాంతంగా కొన్నినెలలు ఉండిరమ్మని సలహా యిచ్చాట్ట డాక్టరు” అని నారాయణరెడ్డి వెళ్తూ వెళ్తూ ఆగి మావైపు తిరిగి "చెలం చెప్పినట్టు, ప్రపంచం బాధ మన సుందర్రావు బాధ. అందుకే తట్టుకోలేక గుండెచెదిరి ఆసుపత్రి పాలయ్యాడు" అని చెట్టుకిందకి వెళ్లాడు.

మేమంతా ఆగిపోయి అతనికేసి చూస్తూండిపోయాం.

వెనకవాళ్ల హెచ్చరికతో ముందుకు కదిలి గాజు తలుపులోంచి సుందర్రావును చూసాం. ప్రశాంతగా నిద్రపోతున్నాడు. పక్కన కుర్చీలోకూర్చున్న దీప అక్కడినుంచే చెయ్యూపి మమ్మల్ని పలకరించింది. మంచంపక్కన ట్యూబులు, మిషన్లు ఉన్నాయి.

సుందర్రావును చూసి వెనుదిరిగాక మా సంఘ సభ్యులుకూడా చెట్టుకిందకెళ్లి చందాలివ్వడం మొదలుపెట్టారు.

"నేనూ కొంత క్యాష్ తెచ్చాను పద" అన్నాడు మా ఎదురింటి చలపతి.

"నేను చెక్కు తెచ్చాను" అంటూ అతనివెనక నడిచాను.

ఇద్దరం వెళ్లి అవిచ్చేసాక మా వ్యానువైపు నడిచాం.

"దీప ధైర్యంగానే వుంది" అన్నా

"యింతమంది ఆత్మబంధువులుంటే చావును సంతోషంగా పిలవచ్చు" అన్నాడు చలపతి ఆకాశంలోకి చూస్తూ.

"మన సంఘధర్మాన్ని అతను లెక్కజెయ్యలేదనే అనుకున్నాం" అన్నా వ్యాను దగ్గరికొచ్చాక. అప్పటికే మావాళ్లంతా మౌనంగా ఎక్కి కూర్చున్నారు. వొకరిమొహాలొకరు చూసుకోవడంలేదు సుందర్రావును చూడ్డానికి ఇంకా ఒకరు, ఇద్దరు వస్తూనే ఉన్నారు.

"లెక్కజెయ్యనిమాట వాస్తవమేగాని అతనే మనకంటే నిజమైన సంఘజీవి" అన్నాడు చలపతి ట్యాక్సి ఎక్కబోతూ ఆగి.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments